సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 18 । జూలై । 2024



కుష్టు నిర్మూలనే లక్ష్యం..
నేటి నుంచి ఎల్‌సీడీసీ సర్వే జరగనుంది. కుష్టు వ్యాధి బాధితులను గుర్తించనున్నారు.
- 8లో



ప్రాణం తీసిన మద్యం మత్తు
మద్యం మత్తు ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. మెళియాపుట్టిలో ఘటన జరిగింది.
- 8లో

నేడు డిగ్రీ చివరి ఏడాది ఇన్‌స్టెంట్ రిజల్ట్
ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ చివరి ఏడాది ఐదో సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన ఇన్‌స్టెంట్ ఫలితాలు గురువారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు అంతా సిద్ధం చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. 241 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 9వ తేదీన పరీక్ష నిర్వహించారు.

న్యూస్‌రీల్

రావివలస ఫెర్రో అల్లాయీస్ పరిశ్రమకు లాకౌట్ నోటీసులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలసలో గల వెంకటేశ్వర ఇంజినీరింగ్ వర్క్స్ పేరుతో ఉన్న ఫెర్రో అల్లాయీస్ పరిశ్రమకు బుధవారం లాకౌట్ నోటీసులు జారీ చేయడంతో కార్మికుల్లో ఆందోళన చోటు చేసుకుంది. ఒకప్పుడు జీఎంఆర్ సంస్థ నిర్వహణలో కొనసాగిన ఈ పరిశ్రమకు తరచూ యాజమాన్య సంస్థలు మారుతూ వచ్చాయి. గత టీడీపీ హయాంలో మొట్టమొదటి సారిగా లాకౌట్ నోటీసులతో పరిశ్రమకు ఇబ్బందులు మొదలయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా అధికారంలో వచ్చిన తర్వాత పరిశ్రమను తెరిపిస్తామని చెప్పి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమను తెరిపించారు. ఆ తర్వాత వివిధ కారణాలతో యాజమాన్య సంస్థలు మారుతూ వచ్చాయి. ఇప్పుడు మళ్లీ లాకౌట్ నోటీసులు జారీ చేయడంతో కార్మికుల్లో భయాందోళన మొదలైంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఫెర్రో అల్లాయీస్ ఉత్పత్తి నష్టతరంగా ఉందనే కారణంతో ఈ నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కార్మికులంతా కోరుతున్నారు.

దడ పుట్టిస్తున్న ధరలు



హిరమండలం: టమాటా, ఉల్లి, కూరగాయల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. వీటితో పాటు పప్పుధాన్యాల ధరలు కూడా పెరగడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఉసూరుమంటున్నారు. బుధవారం టమాట ధర కిలో రూ.100కు చేరింది. ఉల్లి రూ.50కు చేరింది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

అందుబాటులో సీఎన్‌జీ



నవభారత్ సమీపంలోని బంకులో సీఎన్‌జీ నిల్వ యూనిట్

ఎచ్చెర్ల క్యాంపస్: పెట్రోల్ బంకుల్లో సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) అందుబాటులోకి తెస్తున్నారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్)కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీ వినియోగం పెరుగుతోంది. కాలుష్య నియంత్రణ, నిర్వహణ ఖర్చు 50 శాతానికి తగ్గటం వంటి అంశాల వల్ల వాహన చోదకులు ఆసక్తి చూపిస్తున్నారు. మరో పక్క కార్లలోనూ దీని వినియోగం పెరుగుతోంది. తొలి సీఎన్‌జీ బైక్ కూడా ఇటీవలే విడుదలైంది. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో సీఎన్‌జీ యూనిట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వినియోగరుల అభిరుచి, ఎకానమీ దృష్టిలో పెట్టుకొని పెట్రోలియం సంస్థలు సైతం సీఎన్‌జీ యూనిట్‌లు బంకుల్లో ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి.

మరో సెంచరీ



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన స్టార్ క్రికెటర్ నంబల్ల సుశాంత్ వరుసగా రెండో మ్యాచ్‌లో రాణించి సెంచరీ బాదేశాడు. ఏసీఏ అంతర్‌జోనల్ అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీలో రెస్టాఫ్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుశాంత్ విశాఖపట్నంతో జరిగిన మొదటి మ్యాచ్‌లో 121 పరుగులతో కదంతొక్కిన విషయం తెలిసిందే. ఇప్పుడు రెండో మ్యాచ్‌లోనూ సెంచరీ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రెస్టాఫ్ సెంట్రల్ జోన్ నిర్ణీత 50 ఓవర్లలో 363 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 291 పరుగులు చేసి ఓటమిపాలైంది. అయితే సుశాంత్ రాణింపుతో జట్టుకు భారీ పరాభవం తప్పింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ 99 బంతుల్లో 11 బౌండరీలు, రెండు సిక్సర్ల సహాయంతో 104 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. సుశాంత్ వరుసగా రెండో సెంచరీ సాధించడం పై జిల్లా అధ్యక్షుడు పీఎల్ఎన్ శాస్త్రి, కార్య దర్శి హసన్‌రాజ షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ రవికుమార్, కోచ్‌లు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



జగదీశ్వరరావు (ఫైల్)

- జమ్మూలో జరిగిన కాల్పుల్లో మృతి చెందిన జగదీశ్వరరావు
- గ్రామానికి చేరిన పార్థివ దేహం
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



గార్డ్‌ఆఫ్ హానర్ ఇస్తున్న పోలీసులు

అవనీ ఆకాశం ▸ అశ్రుమయం నీకోసం

వీరుడా వీడ్కోలు.. అంటూ జన్మనిచ్చిన గడ్డ ఆ జవానుకు నివాళి పలికింది. నీ త్యాగం అమరం.. అంటూ బంధుమిత్ర గణం అశ్రు నయనాలతో అంజలి ఘటించింది. జమ్మూలో ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ హవాల్దారు సనపల జగదీశ్వరరావు అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో అధికారిక లాంఛనాలతో బుధవారం నిర్వహించారు. సోమవారం జగదీశ్వరరావు మృతి చెందగా.. భౌతిక కాయాన్ని జమ్మూ నుంచి న్యూఢిల్లీకి, అక్కడ నుంచి విశాఖపట్నంకు విమానంలో ఆర్మీ అధికారులు తరలించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వేకువజామున 2.30 గంటలకు నందిగాం తీసుకురాగా.. ఉదయం వరకు అక్కడే ఉంచి 6 గంటలకు నందిగాం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. నందిగాంతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులు భారత్ మాతాకీ జై అంటూ ఊరేగింపుగా జగదీశ్వరరావు పార్థివ దేహాన్ని వల్లభరాయనిపాడుకు తరలించారు. అక్కడ గ్రామంలోనూ ఊరేగించి ఇంటి వద్దకు చేర్చారు.



జగదీశ్వరరావు భౌతిక కాయాన్ని ర్యాలీగా ఊరేగిస్తూ తీసుకువెళుతున్న దృశ్యం

జగదీశ్వరరావు మృతదేహాన్ని చూసి భార్య సమత, పిల్లలు, తల్లి, ఇతర కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. గ్రామస్తులంతా నివాళులర్పించాక భౌతిక కాయాన్ని అంతిమ సంస్కారానికి తరలించారు. జగదీశ్వరరావు భౌతిక కాయంపై జాతీయ జెండా ఉంచగా నందిగాం తహసీల్దారు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన ఎన్‌సీసీ సిబ్బంది, పలాస, టెక్కలి మాజీ సైనికోద్యోగుల సంఘ సభ్యులు కూడా నివాళులర్పించారు. అనంతరం ఏఆర్ కానిస్టేబుల్స్ గార్డ్ ఆఫ్ హానర్ చెబుతూ మూడురౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం తండ్రి మల్లేశ్వరరావు తలకొరివి పెట్టి నిప్పంటించారు. కార్యక్రమంలో జమ్ము నుంచి వచ్చిన నలుగురు ఆర్మీ జవాన్లు, నందిగాం పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భర్త భౌతికకాయాన్ని చూసి బోరున విలపిస్తున్న భార్య సమత

– నందిగాం

కొత్త బంగారు లోకం

- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల జోష్
- జిల్లాలో 168 జూనియర్ కాలేజీలు
- ఈ నెల 31 వరకు అడ్మిషన్లకు అవకాశం
- విద్యార్థులకు ప్రైవేటు కాలేజీల గాలం

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ కాలేజీల్లో జోరుగా ప్రవేశాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన నాడు–నేడు ఫలితాలు సుస్పష్టంగా కనిపిస్తుండడంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో మొత్తం 168 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో గత ఏడాది 19,800 మంది అడ్మిషన్లు పొందగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 22,300 అడ్మిషన్లు జరిగినట్టు గణాంకాలు చెబుతున్నారు. ఈ నెల 31 వరకు అడ్మిషన్లకు అవకాశం ఉంది.

జూన్ ఒకటి నుంచి తరగతులు మొదలు..



2024–25 విద్యా సంవత్సరానికిగాను జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు మొదలయ్యాయి. అయితే పాఠశాలలు జూన్ 13న ప్రారంభమయ్యాయి. దీంతో కొన్ని చోట్ల ఇప్పటికీ టీసీలు తీసుకోని విద్యార్థులు చాలా మంది ఉన్నట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనికి తోడు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సైతం జూన్ 27వ తేదీన వెలువడటంతో.. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇప్పుడిప్పుడే టీసీలను తీసుకుని కాలేజీల్లో చేరేందుకు వస్తున్నారు.

ప్రభుత్వ కాలేజీలకు ఎనలేని క్రేజ్..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మనబడి నాడు–నేడు కార్యక్రమం పేరిట జూనియర్ కాలేజీలను అభివృద్ధి చేశారు. ఇంటర్మీడియెట్ విద్యా వ్యవస్థ ఏర్పాటైనప్పటికీ నుంచి ఇప్పటి వరకు ఇంతలా అభివృద్ధి చేసి, మౌలిక వసతులు కల్పించిన దాఖలాలు లేవు.



ఫస్టియర్ విద్యార్థులతో కళకళలాడుతున్న కొయ్యాం జూనియర్ కాలేజీ

విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం



ఈ ఏడాది పదో తరగతిలో 93.35 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావటంతో జూనియర్ కాలేజీలకు డిమాండ్ పెరిగింది. జిల్లా నుంచి 28,745 మంది పరీక్షలు రాయగా 26,833 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 13,489 మంది, బాలికలు 13,344 మంది ఉన్నారు. దీంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారు విద్యార్థులకు గాలం వేస్తున్నారు. సప్లిమెంటరీ విద్యార్థుల కోసం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఊరూరా తిరిగేస్తున్నాయి. అక్కడి కాలేజీల్లోని అధ్యాపకులకు టార్గెట్లు పెట్టి మరీ అడ్మిషన్లు కోసం వేట సాగిస్తున్నారు.

దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు క్రేజ్ పెరిగింది. ముఖ్యంగా జిల్లాలో శ్రీకాకుళం బాలురు, శ్రీకాకుళం బాలికలు, ఇచ్ఛాపురం, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస, కొత్తూరు, కొయ్యాం, కంచిలి, మెళియాపుట్టి, కవిటి, లావేరు తదితర ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు మెరుగ్గా జరిగాయి. అయితే మిగతా కాలేజీల్లో అడ్మిషన్లు నిరాశపరిచేలా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు అడ్మిషన్లపై దృష్టిసారించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అడ్మిషన్లు చాలా మెరుగయ్యాయి..



ఇంటర్మీడియెట్ అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. అన్ని యాజమాన్య జూనియర్ కాలేజీల్లో ముఖ్యంగా ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యేలా ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి. అడ్మిషన్ల వివరాలను సకాలంలో స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలి. తరగతుల నిర్వహణపై దృష్టి పెట్టాలి.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ

ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలి..



ప్రభుత్వ కాలేజీల్లో నిర్దేశించుకున్న టార్గెట్ మేరకు సీట్లు భర్తీ అయ్యేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు టెన్త్ పాసైన ప్రతి విద్యార్థి కాలేజీలో చేరేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. చాలా వరకు ప్రభుత్వ యాజమాన్య కాలేజీలు మెరుగైన అడ్మిషన్లు చేశాయి. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సమన్వయంతో పనిచేసి అడ్మిషన్లు పెంచాలి. శతశాతం మంది హాజరయ్యేలా చొరవ తీసుకోవాలి.

– శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా డీవీఈఓ

వంశధార ఎడమ కాలువకు గండి



వంశధార ఎడమ ప్రధాన కాలువకు పడిన గండి



నీట మునిగిన పంట పొలాలు

హిరమండలం: గొట్టా బ్యారేజీ నుంచి వంశధార నీటిని కొద్ది రోజుల కిందట ముందస్తుగా విడుదల చేశారు. బ్యారేజీ ప్రారంభంలోనే ఎడమ ప్రధాన కాలువకు రంధ్రాలు పడి గండ్లు పడుతున్నాయి. ఈ నెల 3న ఎడమ ప్రధాన కాలువ నుంచి నీరు విడిచిపెట్టారు. కాలువలో 1165 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. దాదాపు రెండు వారాల తర్వాత శివారు ఆయకట్టుగా ఉన్న పలాస నియోజకవర్గానికి వంశధార నీరు చేరింది. కానీ హిరమండలం మండలం ఎంఎల్‌పురం వద్ద కాలువకు మంగళవారం రాత్రి రంధ్రం పడి గండిగా మారి పొలాల్లోకి నీరు చేరింది. వెద పొలాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో నారు పూర్తిగా నాశనమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గొట్టా బ్యారేజీ డీఈ రంగనాయకులు, జేఈ ధనుంజయరావులు బుధవారం కాలువలోని నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తగ్గించి యుద్ధ ప్రాతిపదికన యంత్రాలతో పనులు చేయించి గండిని పూడ్చారు. గట్లను పటిష్టం చేయకుండా నీరు విడిచిపెట్టడంతో ఈ పరిస్థితి తలెత్తింది. డీఈ రంగనాయకులు మాట్లాడుతూ పాములు, ఎలుకలు గట్టుకు రంధ్రాలు పెట్టడంతో సమస్య ఏర్పడిందని, గండిని పూడ్చామని తెలిపారు.

23 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల పత్రాల పరిశీలన

మద్దిలపాలెం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 23, 24, 25 తేదీల్లో పరిశీలిస్తున్నట్లు మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. స్పెషల్ కేటగిరీలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, ఎక్స్‌ట్రా కరిక్యులర్, క్యాప్(మాజీ సైనికుల పిల్లలు) ఉంటారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలకు చెందిన వారు కృష్ణా కళాశాలలో జరిగే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకావాలన్నారు.

● త్యాగానికి ప్రతీక మొహర్రం



జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

మొహర్రం త్యాగానికి ప్రతీక అని, సర్వమానవ శ్రేయస్సు కోసం అందరూ ప్రార్థన చేయాలని ముఫ్తీ జియావుల్ రహ్మాన్ అన్నారు. శ్రీకాకుళంలోని జీటీ రోడ్డులో గల జామియా మసీదులో మొహర్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మసీదు ముఫ్తీ రహమాన్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఇమామ్ ఖాజీ అబ్దుల్ వహాబ్, మౌజన్ మహమ్మద్, మసీదు కమిటీ అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు హాజీ భయ్యా, సెక్రటరీ అక్బర్ భాషా, జాయింట్ సెక్రటరీ షకూర్ ఖాన్, ట్రజరర్ ఉస్మాన్, సభ్యులు సయ్యద్ షఫీ, మతాబ్‌ఖాన్, అబ్దుల్, కరీం, ఇర్ఫాన్ భాషా, హాజీ, గౌరవ అధ్యక్షులు అమీ రుల్లా బేగ్ సలీం ఖాన్ పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

● ఏకాదశి వైభవం



శయన ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి ఆలయాల్లో స్వామిని అలంకరించి అర్చనలు చేశారు. శ్రీకాకుళం చిన్నబజారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామిని తులసిమాలలతో అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

విద్యార్థులపై అభిమానంతో..



బెలగాం ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న నిరంజన్ ఖడంగా

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయుడు నిరంజన ఖడంగా విలువైన సాయం చేస్తున్నారు. ఆర్.బెలగాం స్కూల్‌లో హిందీ టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో విద్యార్థులకు హిందీ పాఠాలు జరగడం లేదు. అయితే ప్రస్తుతం కంచిలి మండలంలోని బూరగాంలో విధులు నిర్వహిస్తున్న నిరంజన ఖడంగాకు గతంలో ఆర్.బెలగాంలో పని చేసిన అనుభవం ఉంది. ఆ చొరవతో అక్కడి విద్యార్థులకు తమకు పాఠాలు చెప్పాలని కోరారు. దీంతో ఆయన విద్యార్థుల కోరికను కాదనకుండా స్వచ్ఛందంగా ఈ పాఠశాలకు వచ్చి బోధిస్తున్నారు. సెలవు రోజుల్లో సిలబస్ పూర్తి చేసేలా చూడాలని విద్యార్థులు కోరడంతో కాదనలేకపోయానని ఆయన తెలిపారు.

జిల్లా ఇంజినీరింగ్ కాలేజీల్లో 85.74 శాతం ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యా మండలి ఇంజినీరింగ్ కళాశాలల అలాట్‌మెంట్‌లను బుధవారం ప్రకటించింది. ఏపీఈఏపీ సెట్ – 2024 ఎంపీసీ స్ట్రీమ్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఈ నెల 1 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. విద్యార్థులు ఇచ్చుకున్న ఆప్షన్లు, ర్యాంకు మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా సీట్లు కేటాయించారు. జిల్లాలోని నాలుగు ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 2154 సీట్లు ఉండగా, 1847 ప్రవేశాలు జరిగాయి. 85.74 శాతం ప్రవేశాలు జరిగాయి. ప్రైవేట్ కళాశాలల్లో 70 శాతం కన్వీనర్ కోటా, 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. టెక్కలి ఐతం కళాశాలలో 1104 సీట్లకు 1075, చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 384 సీట్లకు 295, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో 336 సీట్లకు 228, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజ్‌లో 330 సీట్లకు 249 ప్రవేశాలు జరిగాయి. క్లాస్‌వర్క్ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. సీట్లు లభించిన విద్యార్థులు 22వ తేదీ లోపు కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. లేదంటే సీట్లు కోల్పోతారు. త్వరలో ఉన్నత విద్యా మండలి తుది విడత కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ కౌన్సెలింగ్‌లో ఏపీఈఏపీ సెట్‌లో మొదటి విడత కౌన్సెలింగ్‌కు హాజరు కానివారికి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. మొదటి కౌన్సెలింగ్‌లో సీటు లభించిన వారికి కళాశాల, బ్రాంచ్‌లు మార్చుకునే అవకాశం వస్తుంది.

క్లుప్తంగా

పాఠశాలలో కూలగొట్టిన గోడ పునర్నిర్మాణం


కూలగొట్టిన గోడను నిర్మించిన దృశ్యం

ఎల్ఎన్ పేట: మండలంలోని తాయిమాంబ పురం (గార్లపాడు) పునరావాస కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రెండు రోజుల కిందట కూలగొట్టిన గోడను మళ్లీ నిర్మించారు. పునరావాస కాలనీలో ఉన్న పాఠశాలలో రెండు తరగతి గదులను కలిపి ఎమ్మార్సీగా వినియోగించుకునేందుకు ఎంఈఓ–1 సీహెచ్ మణికుమార్ రంగం సిద్ధం చేసి రెండు రోజుల కిందట గోడ కూలగొట్టే పనులు ప్రారంభించారు. గ్రామస్తులు అడ్డుకోవటంతో పాటు బుధవారం పలు పత్రికల్లో వార్తలు రావటంతో స్పందించిన ఎంఈఓ–1 గోడను నిర్మించే పనులు పూర్తి చేశారు.

కోటబొమ్మాళిలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన


కోటబొమ్మాళి కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం పర్యటించారు. తొలుత కొత్తమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం రైతుబజార్‌ను సందర్శించి అక్కడ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు సంతమైదానం, ఎన్టీఆర్ పార్కు, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద స్థలాలను పరిశీలించారు. అనంతరం కొత్తపేటలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయానికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఇటీవల కేజీబీవీలో 26 మందికి డయేరియా రావడంపై సర్వ శిక్షా ఏపీసీ రోణంకి జయప్రకాష్‌ను ప్రశ్నించారు. మెనూ, మరుగుదొడ్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు.

చీడివలసలో కేసుల దర్యాప్తుపై డీఎస్పీ ఆరా


చీడివలస గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీకాకుళం డీఎస్పీ శృతి

బూర్జ: చీడివలస గ్రామంలో శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి బుధవారం పర్యటించారు. పలు చోరీల కేసుల్లో నిందితులను గుర్తించడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలపై ఆమె ఆరా తీశారు. గ్రామంలో ఇటీవల సోలార్ ప్యానల్, బంగారు ఆభరణాలు దొంగిలించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసుల విషయంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొల్లివలస వచ్చిన పోలీసులతోనూ ఇలాగే వాగ్వాదం పెట్టుకున్నారు. దీంతో డీఎస్పీ గ్రామానికి వెళ్లి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ జీవీ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో దినసరి కూలీ మృతి


పోతయ్య మృతదేహం

టెక్కలి రూరల్: కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన టెక్కలిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎన్టీఆర్ కాలనీకి చెందిన బతకల పోతయ్య (55) అనే వ్యక్తి బుధవారం స్థానిక మండపోలం కాలనీ సమీపంలో ఒక షాపు పైన జరుగుతున్న వెల్డింగ్ పనులకు వెళ్లాడు. పని జరుగుతున్న సమయంలో ఒక ఐరన్ పైపును కింద నుంచి బిల్డింగ్ మేడపైకి తీసుకువెళ్తుండగా బిల్డింగ్ ముందు వైపుగా వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్ పైపుకు తగలడంతో ఆయనకు షాక్ కొట్టి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య జయలక్ష్మి, పిల్లలు సంతోష్, ఇంద్రజ ఉన్నారు. పోతయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు గుండెలు పగిలేలా రోదించారు.

కుష్టు నిర్మూలనే లక్ష్యం

- నేటి నుంచి ఆగస్టు రెండు వరకు ఎల్‌సీడీసీ సర్వే
- 2234 టీమ్‌లతో సర్వేకు సన్నద్ధం
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స


నరసన్నపేట మండల మాకివలస పీహెచ్‌సీ పరిధిలోని సత్యవరం కాలనీలో జరుగుతున్న సర్వే (ఫైల్)

నరసన్నపేట: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా జిల్లాలో నేటి నుంచి సర్వే నిర్వహించనున్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) సర్వే–24 పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుంది. జిల్లాలోని ముప్పై మండలాలతో పాటు శ్రీకాకుళం నగర పాలక సంస్థ, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో సమగ్రంగా సర్వే నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 7,24,783 ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లకు వెళ్లి ఉన్న జనాభా మేరకు సర్వే ప్రక్రియ కొనసాగనుంది. మొత్తం 2234 టీమ్‌లతో ఈ సర్వే నిర్వహిస్తారు. ఒక్కో టీమ్‌లో ఆశ వర్కర్‌తో పాటు మగ వలంటీర్‌లు ఉంటారు. వారు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తారు. కొత్త కేసులను గుర్తించి వారికి పూర్తి స్థాయిలో వైద్యం అందించి దశల వారీగా కుష్టు వ్యాధిని జిల్లాలో నిర్మూలించాలనేదే తమ లక్ష్యమని సిబ్బంది అంటున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చని వైద్యులు అంటున్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలు ఇవే..

- చర్మంపై స్పర్శ లేని రాగి రంగు గల మచ్చలు.
- చెవులపై బుడిపెలు, కణితిలు, నరాల తిమ్మర్లు.
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం(చర్మంపై ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం).
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం.
- కను రెప్పలు మూత పడక పోవడం.
- చేతుల నుంచి వస్తువులు జారి పోవడం.
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం.
- చేతివేళ్లు, కాళి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం.
- కాళ్ల చెప్పులు జారిపోవడం.
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేక పోవడం
- పాదాలు, మడిమల్లో వాపు.
- ముక్కు దిబ్బడం, ముక్కు నుంచి రక్తం కారడం

చికిత్స ఉచితమే..

కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రెండు పద్ధతుల ద్వారా వైద్య సేవలు అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి పాసివ్ బ్యాసిలరీ(పీబీ) విధానంలో ఆరు నెలలు పాటు చికిత్స అందిస్తారు. అలాగే ఐదు మచ్చలు పై బడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ(ఎంబీ) విధానంలో 12 నెలలు చికిత్స అందిస్తారు. దీనిలో భాగంగా నెలకు ఒక సారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చు. 1987 తర్వాత నుంచి బహుళ ఔషధ చికిత్స(మల్టీ డ్రగ్ థెరఫీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నారు. వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సర్వేకి సహకరించాలి



జిల్లాలో లెప్రసీ వ్యాధిని సకాలంలో గుర్తించి వారికి తగిన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఎల్‌సీడీసీ–24 సర్వే చేపడుతున్నాం. ప్రజలు అందరూ సహకరించాలి. వైద్య సిబ్బంది కూడా ప్రతి ఒక్కరినీ సర్వే చేయాలి. ఎలాంటి లక్షణాలు ఉన్నా వెంటనే వైద్య సిబ్బంది తెలియజేయాలి. లెప్రసీ వ్యాధిని తొందరగా గుర్తిస్తే సకాలంలో వ్యాధిని తగ్గించుకోవచ్చు.

– బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

కొత్త కేసుల నమోదు ఇలా...

సంవత్సరం	2017	2018	2019	2022	2023
కేసులు	219	195	169	95	143

రెండు షాపుల్లో చోరీ


రవిచంద్రా ట్రేడర్స్‌లో దొంగలు తెరిచిన సొరుగు


సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం

నరసన్నపేట: నరసన్నపేటలో ముగ్గురు దొంగలు మెయిన్ రోడ్డుపై ఉన్న రెండు ట్రేడర్స్ షాపుల్లో మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. సొరుగుల్లో ఉన్న రూ. 60 వేల నగదును అపహరించారు. మెయిన్ రోడ్డుపై వెంకటేశ్వర థియేటర్ సమీపంలో సత్యనారాయణ ట్రేడర్స్, రవిచంద్రా ట్రేడర్స్ ఉన్నాయి. వ్యాపారాలు పూర్తయిన తర్వాత మంగళవారం రాత్రి షట్టర్లు వేసుకుని షాపు యజమానులు సతీష్, రవిచంద్రలు వెళ్లిపోయారు. ఉదయం అవసరాలకు వీలుగా సొరుగుల్లో కొంత నగదును ఉంచారు. ఈ నగదును రాత్రి పూట దొంగలు చోరీ చేశారు. సత్యనారాయణ ట్రేడర్స్‌లో రూ. 40 వేలు, రవి చంద్రా ట్రేడర్స్‌లో రూ. 20 వేలు నగదు పోయినట్లు షాపు యజమానులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ మరింతగా పెంచాలని వ్యాపార వర్గాలు కోరుతున్నాయి.

అర్ధరాత్రి ద్విచక్రవాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్రవాహనం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనాన్ని పెట్రోల్ పోసి కాల్చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రత్తకన్న దేవాంగ వీధికి చెందిన సిరిపురపు కుమార్ తన ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనాన్ని ఇంటి వద్ద రాత్రి ఉంచారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ గోపాలకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు


మెళియాపుట్టి శ్మశాన వాటిక వద్ద అతపాకల శ్రీధర్ మృతదేహం

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని మహేంద్ర తనయ వంతెన సమీపంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక ఎస్ఐ టి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. జాడుపల్లి గ్రామానికి చెందిన అతపాకల శ్రీధర్ అనే వ్యక్తి బుధవారం మెళియాపుట్టి ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం సేవించి మహేంద్ర తనయ నదీ సమీపంలోని మర్రిచెట్టు వద్దనున్న ఓ సిమ్మెంట్ దిమ్మపై కూర్చున్నాడు. ఆ మత్తులో కాసేపటికే తూలి శ్మశాన వాటిక వైపు పడిపోయాడు. అక్కడ స్నానాలకు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ పైపునకు తల బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అటుగా వెళ్తున్న వారు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి వెళ్లి చూసేసరికే అతను చనిపోయి ఉన్నాడు. మృతుని భార్య సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ.. నిత్యం మద్యం తాగుతూ తిరిగేవాడని, దాని వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నూతన డీఐజీని కలిసిన ఎస్పీ


డీఐజీ గోపినాథ్‌కి మొక్కను బహూకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజి నూతన డీఐజీగా బాధ్యతలు చేపట్టిన గోపీనాథ్ జెట్టిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం కలిశారు. విశాఖ రేంజి డీఐజీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు.

సాఫ్ట్‌బాల్ సీనియర్స్ ఎంపిక పోటీలు ప్రారంభం


సాఫ్ట్‌బాల్ ఆడి ఎంపికలను లాంఛనంగా ప్రారంభిస్తున్న కలిదిండి వెంకటరామరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడ పరిచయమైన అనతికాలంలో ఎనలేని ఆదరణ చూరగానడం సాఫ్ట్‌బాల్ సంఘానికి గర్వకారణంగా ఉందని శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు పేర్కొన్నారు. జిల్లా స్థాయి సీనియర్స్ (పురుషులు, మహిళలు) సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలిదిండి మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ స్థాయిలో, పాఠశాలల్లో సాఫ్ట్‌బాల్ గేమ్‌ను పరిచయం చేస్తున్నామన్నారు. మరో ముఖ్య అతిథి సన్ రైజ్ హాస్పటల్ ఎండీ బొడ్డేపల్లి సురేష్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు, వ్యాయామంలో పాల్గొనేవారికి శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం చైర్మన్ బడగల హరిధరరావు, ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు తదితరులు మాట్లాడుతూ క్రీడాకారులు ఎంపిక పోటీల్లో క్రీడాస్ఫూర్తిని కనబర్చాలన్నారు.

ఆగస్ట్ 10 నుంచి రాష్ట్రపోటీలు..

జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకట రమణ మాట్లాడుతూ గుంటూరు వేదికగా ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఇక్కడ ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. క్రీడాకారులకు ఈనెలాఖరు నుంచి శిక్షణ శిబిరాలనున ఇర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, సబ్ రిజిస్ట్రార్ గురుగుబెల్లి రాజు, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మెట్ట తరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్ కుమార్, ఎం.ఆనంద్ కిరణ్, అన్నెపు రాజగోపాల్, గురుగుబెల్లి రాజశేఖర్, ఎ.డిల్లేశ్వరరావు, మల్లేశ్వరరావు, పేడాడ బాబూరావు, ఎన్వీ రమణ, రెడ్డి రవికుమార్, తోటారావు, పెంటయ్య, వినోద్, మధుసూదన్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్పీ రాధికకు సన్మానం


ఎస్పీ రాధికకు జ్ఞాపికను అందజేస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : రెండున్నరేళ్లు జిల్లాలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన ఎస్పీ జీఆర్ రాధికకు జిల్లా పోలీసు యంత్రాంగం బుధవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్లో అదనపు ఎస్పీలు జి.ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డి.గంగాధర్, డీఎస్పీలు వై.శృతి, శేషాద్రినాయుడు, శ్రీనివాసరావు, త్రినాథ్, బాలచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డిలు పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి దుశ్శాలువలతో ఎస్పీని సత్కరించారు.

ఎస్పీ రాధిక మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతగానో సహకరించారని, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, క్లిష్టమైన బందోబస్తు విధుల నిర్వహణలో అందరి కృషి అభినందనీయమన్నారు. నూతన ఎస్పీ మహేశ్వరరెడ్డికి సహకారం అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, నెహ్రూ యువజన అధికారి ఉజ్వల్, సీఐలు, ఆర్‌లు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులతో ఆదాయం


కేవీకేలో పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులపై తయారీ శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులతో ఆదాయాభివృద్ధి సాధ్యమని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన యువ రైతులకు గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో మూడోరోజు వృత్తి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన మండలాలైన సీతంపేట, వీరఘట్టం, కొత్తూరు పాలకొండ, హిరమండలం, భామిని, మెళియాపుట్టి, బూర్జ, మందస మండలాల్లో పైనాపిల్ పండిస్తారని తెలిపారు. రవాణా సదుపాయాలు, సరైన మార్కెటింగ్ లేకపోవడం అనేది ప్రధాన సమస్యగా ఉండడం వల్ల అధిక శాతం పంటను నష్టపోతున్నారని పేర్కొన్నారు. అందుకే జామ్‌లు, క్యాండీలు వంటి విలువాధారిత ఉత్పత్తులు తయారు చేస్తే ఆదాయం పొందవచ్చని సూచించారు. మూడురోజులుగా జామ్ క్యాండీ స్క్వాష్‌ను తయారు చేయడం పై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ప్యాకింగ్, లేబులింగ్ ఫుడ్ రిజిస్ట్రేషన్, పర్సనల్ హైజినిక్ గురించి నేర్పించామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ గిరిజన యువ రైతులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ, డాక్టర్ వి.హరికుమార్, డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు వ్యాగన్‌లో పొగలు

- పూండి రైల్వే స్టేషన్‌లో ఘటన


పూండి రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన గూడ్స్ రైలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు నుంచి పొగలు వ్యాపించాయి. చంబల్‌పూర్ డివిజన్ తాల్చేరు వైపు నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు వ్యాగన్లతో వెళ్తున్న గూడ్స్ రైలు సాయంత్రం 6.05 గంటలకు పూండి స్టేషన్‌కు చేరుకోగానే 16వ వ్యాగన్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో గూడ్స్ గార్డు జైప్రకాష్ యాదవ్‌కు మరో ట్రెన్ గార్డు పొగలు వస్తున్నట్లు చెప్పడంతో పూండి రైల్వే స్టేషన్‌లో రెండో నంబరు ప్లాట్ ఫాంపై నిలిపి స్టేషన్ మాస్టర్ ఎన్.పాడికి సమాచారం ఇచ్చారు. ఆయన పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలాస ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అగ్నిమాపక శకటంతో పూండి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఫైర్ ఆఫీసర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది జి.మన్మధరావు, బి.ప్రేమ్‌కుమార్, రామినాయుడు, విష్ణు, గోపాల్ ట్రెన్ వ్యాగన్లను పరిశీలించి 16వ వ్యాగన్‌లో పొగలు వస్తున్నట్లు గుర్తించారు. అనంతరం మంటలను అదుపు చేశారు. అదే ట్రాక్‌లో వస్తున్న ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లను లూప్ ట్రాక్‌లో ఆటంకం లేకుండా గమ్యస్థానాలకు పంపారు. పొగలు రావడానికి గల కారణాలు అధికారులు అన్వేషిస్తున్నారు.

శ్వేత పత్రాల పేరుతో విష ప్రచారం

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అందరి దృష్టిని మరల్చేందుకు వారానికో శ్వేత పత్రం పేరుతో సీఎం చంద్రబాబు విష ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ మండిపడ్డారు. పట్టణంలోని జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రంలో గత ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో లక్షా 7 వేల ఎకరాలను అన్యాక్రాంతం చేశారని, పేదల అసైండ్ భూములు తీసుకున్నారని అబద్ధాలు చెప్పారని అన్నారు. ఎవరి భూములను జగన్‌మోహన్‌రెడ్డి అన్యాక్రాంతం చేశారో చంద్రబాబు నిరూపించాలని సవాల్ చేశారు. చంద్రబాబు విడుదల చేసిన శ్వేత పత్రాల్లో ఎలాంటి పస లేదన్నారు. సంపద సృష్టిస్తానని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. 35 రోజుల్లోనే రూ.14,200 కోట్లు అప్పు చేసి ప్రజలను మోసం చేసిందన్నారు. వారానికో శ్వేతపత్రం అంటూ నాలుగు చెత్త పత్రాలను విడుదల చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే ఎదురు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ వద్ద చక్రం తిప్పి రాష్టాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, నాయకులు నరసింహ, రామ్మోహన్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు ఎదురుచూస్తున్న పీఆర్సీ కొరకు వెంటనే కసరత్తు ప్రారంభించాలని, ఈలోగా మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన మూడు,నాలుగు,ఐదు తరగతులను తిరిగి మాతృ ప్రాథమిక పాఠశాలలో కలపాలని డిమాండ్ చేశారు. ఇందుకు కారణమైన జీఓ నంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని భానుమూర్తి కోరారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, కార్యదర్శి ఎస్వీ అనీల్‌కుమార్ మాట్లాడుతు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా ఉపాధ్యాయ రంగాల సంస్కరణలను చేపడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సీబీఎస్ఈ సిలబస్‌ను కేవలం సీబీఎస్సీ పాఠశాలలకు మాత్రమే పరిమితం చేసి మిగిలిన అన్ని పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించవద్దని వారు విన్నవించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు.

సర్వీస్ రూల్స్ ప్రకటించాలి..

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ప్రకటించి అమలు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, సర్వీసు రూల్స్ ప్రకటించి అమలు చేయాలని, వివిధ యాజమాన్యాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు, సర్వీసు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేక తీర్మానాలు ఆమోదించారు. ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో సమన్వయ పరుచుకుని విద్య ఉద్యోగ రంగాల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు పి.అప్పలనాయుడు, జి.భీమారావు, కె.గోపికృష్ణ, బి.నేతాజీరావు, చావలి శ్రీనివాస్, ఎస్.చాణిక్య, వి.నవీన్‌కుమార్, దాసరి రామ్మోహనరావు, పి.తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లు, బి.సుభాష్‌బాబు, పైడి శ్రీరామమూర్తి, కె.విజయకుమార్, ఎన్ నీలామోహన్, శాంతారామ్, ప్రభావతి పాల్గొన్నారు.